మూలనపడిన కియోస్క్‌లు

రైతుల సంక్షేమమే ధ్యేయంగా గత ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తోంది. రైతులకు స్థానికంగా అన్ని సేవలూ అందేలా ఏర్పాటుచేసిన ఆర్బీకేలను నిర్వీర్యం చేసింది. ఏడాదిగా రైతులకు పంటల సాగులో తగిన సలహాలు, సూచనలు అందడంలేదు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, పశువుల దాణా, వ్యవసాయ పనిముట్లు, మార్కెటింగ్ తదితర సేవలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు ఏర్పాటుచేసిన కియోస్క్ యంత్రాలను మూలన పడేసింది. దీంతో రైతులు ప్రైవేటు డీలర్ల వద్దకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది.



దొరవారిసత్రం మండలం పోలిరెడ్డిపాళెంలోని రైతు సేవా కేంద్రం , కొత్తపల్లి ఆర్బీకే, పోలిరెడ్డిపాళెం ఆర్బీకేలో నిరుపయోగంగా మారిన కియోస్క్‌లు

- రైతులకు అందని సేవలు
- ఎరువులు, మందుల కోసం ప్రైవేటు డీలర్ల వద్దకు పరుగులు
- ఆర్బీకేలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

దొరవారిసత్రం : సూళ్లూరుపేట నియోజకవర్గంలోని దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ, ఓజిలి, నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో రైతు సేవా కేంద్రాలు (ఆర్బీకేలు) నామమాత్రంగా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఉన్న కియోస్క్ యంత్రాలను వినియోగిస్తున్నామని ఆ శాఖ అధికారులు, సిబ్బంది చెప్పడం తప్ప ఎక్కడా వినియోగించిన దాఖలాలు లేవు. కొన్ని కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు మూలన పడేశారు. కియోస్క్‌లకు బదులు కూటమి ప్రభుత్వం పీఎంఏఐడీ యాప్‌ను తీసుకువచ్చింది. దీనిద్వారా తగినంత మేర సేవలు అందడం లేదని రైతులు చెబుతున్నారు. కియోస్క్‌లలో ప్రస్తుతం మార్కెట్‌లో పంటలకు లభిస్తున్న ధరలు, మార్కెటింగ్ సదుపాయం ఎక్కడ ఉంది. ఎరువులు, పురుగు మందుల ధరలు తెలుసుకునే అవకాశం ఉండేది. అంతేగాక పంటలను ఆశ్రయించే చీడపీడలు, వాటి నివారణ పద్ధతులను తెలుపుతూ వీడియోలు, ఫొటోలు లభించేవి. రైతులు వాటిని చూసి అవగాహన పొంది పంటల సాగు చేపట్టేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్‌లో అన్ని వివరాలు ఉండడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

మండలం	ఆర్బీకేల సంఖ్య	రైతుల సంఖ్య
దొరవారిసత్రం	11	3740
సూళ్లూరుపేట	13	3700
తడ	16	2800
నాయుడుపేట	12	5340
పెళ్లకూరు	13	4203
ఓజిలి	10	7052

ఆర్బీకేలతో ఎంతో మేలు జరిగింది



రైతుకు ఏది అవసరమున్నా ఆర్బీకేల్లో ఉన్న కియోస్క్ యంత్రాల్లో నమోదు చేసుకునేవారం. వాటిని సంబంధిత సిబ్బంది ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు ఏది కావాలన్నా పట్టణ ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తుంది. ఆర్బీకేలతో రైతులకు ఎంతగానో మేలు జరిగింది.

– సుబ్బరామయ్య, అయ్యపాళెం, దొరవారిసత్రం

కేంద్రాలు ఉన్నాయో లేదో తెలియడం లేదు



ప్రభుత్వం మారిన తర్వాత ఆర్బీకేలు పనిచేస్తున్నాయో లేదో కూడా తెలియడం లేదు. గతంలో ఎరువులు, పురుగు మందులు, పశువుల దాణా, వ్యవసాయ పనిముట్లను కియోస్క్ యంత్రాల ద్వారా బుక్ చేసుకునేవారం. ఇప్పుడు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

– చెంగయ్య, కొత్తపల్లి, దొరవారిసత్రం

ఆర్బీకే సేవలు కొనసాగించాలి



రైతులకు సేవలు అందించే విషయంలో ఆర్బీకేలు కీలకపాత్ర పోషించాయి. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించాలి. ఆర్బీకేలను యథావిధిగా కొనసాగించాలి. అప్పుడే రైతులకు గ్రామంలోనే సేవలు అందుతాయి. కియోస్క్‌లు సైతం పని చేసేలా చూడాలి.

– బాలసుబ్రమణ్యం, తాళ్వాయిపాడు, పెళ్లకూరు

దళారులు విజృంభిస్తున్నారు



జగనన్న ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా రైతు ఇంటి ముంగిటకే సేవలు అందాయి. కూటమి ప్రభుత్వం ఆర్బీకేలను నిర్వీర్యం చేసింది. మళ్లీ దళారుల విజృంభిస్తున్నారు. దీంతో రైతు ప్రతి విషయంలోనూ నష్టపోతున్నాడు. ఆర్బీకేల సేవలు కొనసాగేలా చూడాల్సిన అవసరం ఉంది.

– అల్లూరు రాహుల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, డీవీ సత్రం

క్లుప్తంగా

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా అధికారి


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న షేక్ ఖాదర్ వలీ

కలువాయి(సైదాపురం): కలువాయిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి షేక్ ఖాదర్ వలీ తనిఖీ చేశారు. టీబీ ముక్త అభియాన్ కార్యక్రమం నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ రఘురామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

భూముల్లో సాగుకు అనుమతి ఇవ్వండి


భూముల సాగుకు అనుమతి ఇవ్వాలని వేడుకుంటున్న తీగపాళెం గ్రామస్తులు

చిల్లకూరు : క్రిస్ సిటీ కోసం సేకరించిన భూములకు పూర్తి స్థాయి పరిహారం అందించే వరకు పంటలు సాగు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని తీగపాళెం గ్రామస్తులు కోరారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. క్రిస్ సిటీ కోసం కోట, చిల్లకూరు మండలాల్లో ఏపీఐఐసీ ద్వారా తొలి విడతగా సుమారు 950 ఎకరాల భూములు సేకరించినట్లు తెలిపారు. కొంత మందికి పరిహారం చెల్లించారని తెలిపారు. ఇంకా సుమారు 50 మంది రైతులకు చెందిన 100 ఎకరాల భూములకు పరిహారం ఇవ్వలేదన్నారు. ఈ క్రమంలో అనుమతి ఇస్తే ఆ భూముల్లో వేరుశనగ పంట సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటామని వేడుకున్నారు. తమకు ఈ భూములు తప్ప మరో ఆధారం లేదని వాపోయారు. స్థానిక రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి అనుమతి ఇవ్వాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


ఆటోల పత్రాలను పరిశీలిస్తున్న సీఐ శేఖర్‌బాబు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలపడం, మితిమీరిన వేగంతో నడపడం లాంటివి చేస్తూ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు హెచ్చరించారు. ఆయన గురువారం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా ఆటోలను నిలిపిన పలువురికి జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం లేదన్నారు. ట్రాఫిక్ పోలీసుల ఆదేశాలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే జరిమానా విధిస్తున్నామని తెలిపారు. మరోసారి ఇలాగే వ్యవహరిస్తే లైసెన్సు రద్దు చేయిస్తామని హెచ్చరించారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి


క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

బాలయపల్లి(సైదాపురం): క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి లియోనా తెలిపారు. తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో గురువారం కాట్రగుంట, ఊట్లపల్లిలో పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. 40 ఏళ్లు నిండిన మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు హరిత, చైతన్యభాను, సర్పంచులు కృష్ణయ్య, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యశిబిరం


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సూర్యధర్మేంద్ర

రాపూరు: మండలంలోని రావిగుంటపల్లి సమీపంలో ఉన్న లెప్రసీ కాలనీలోని కుష్టువ్యాధిగ్రస్తులకు గురువారం ఉచితంగా వైద్య సేవలు అందించినట్టు వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు సూర్యధర్మతేజ తెలిపారు. ఆయన మాట్లాడు తూ కుష్టువ్యాధిని ముందుగా గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చన్నారు. అనంతరం వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

అడుగు వేయాలంటే నరకమే


మురుగునీటిలోనే స్వామి వారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు (ఫైల్)


వీధిలో నిలిచిన మురుగునీరు వద్ద చిన్నారుల అగచాట్లు

డక్కిలి: మండల కేంద్రమైన డక్కిలి పంచాయతీ నరసనాయుడుపల్లి సమస్యలతో సతమతమవుతోంది. గ్రామంలో ఎక్కడ చూసినా మురుగునీరు దర్శనమిస్తోంది. చిన్నపాటి వర్షానికే వీధుల్లో నీరు నిలుస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. నీరునిలవకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచును కోరితే తనకు చెక్ పవర్ తొలగించారని, అధికారులకు చెప్పాలని పేర్కొంటున్నట్టు స్థానికులు చెబుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు. గ్రామంలో నెలకొన్న మురుగునీటి సమస్యపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో గ్రామస్తులు సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త నాగార్జునరెడ్డి

వెంకటగిరి రూరల్ : వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం బాలాయపల్లి మండలం జయంపు, జార్లపాడు, ఊట్లపల్లిలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. అలాగే వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ కళాశాలలో ట్రాడ్ ప్లానెట్ ఫౌండేషన్ సంస్థ సమన్వయంతో పర్యావరణ సదస్సు నిర్వహించా రు. కేవీకే శాస్త్రవేత్తలు డి.శ్రీనివాసులురెడ్డి, నాగార్జునరెడ్డి మాట్లాడుతూ పంటల సాగులో నూతన సాంకేతిక విధానంను అవలంభించుకోవాలని సూచించారు. వరి నూతన వంగడాలను , నిమ్మ యాజమా న్య పద్ధతులు, , నేల పరీక్షా విధానం, పకృతి వ్యవసాయం పద్ధతులు, సమతుల ఏరువుల వినియో గంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలో గ్రామస్తులచే మొక్కలు నాటించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు విజయశ్రీ, రాజీవన, భారతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు మంగళ్‌దీప్, బండెప్ప, ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం, సామన్య కంపెనీ డైరెక్టర్ అసుతోష్, పాల్‌రాజ్, విశ్వోదయ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, బాలాయపల్లి ఏవో శిరీష, వీఏఏ సలీం, సర్పంచ్ సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

‘వెన్నుపోటు దినం’ విజయవంతంపై కృతజ్ఞతలు


మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నాయుడుపేట టౌన్/వెంకటగిరి (సైదాపురం) : కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా ఒక్క హామీని అమలుచేయకపోవడాన్ని ఎండగడుతూ వైఎస్సార్ సీపీ నాయుడుపేట, రాపూరు, గూడూరులో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో విద్యార్థులు, రైతులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ క్రమంలో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ఎండగడతామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ముందుంటామని, కార్యకర్తలు, నాయకులకు అండగా ఉండి ముందుకు సాగుతామని తెలిపారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

కోట : పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్నం రుచికరమైన భోజనం పెట్టాలని ఎంఈవో మస్తానయ్య ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు గురువారం కోట జెడ్పీ హైస్కూల్‌లో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో విజయవాడ చారిటబుల్ ట్రస్టు ప్రోగ్రామ్ ఆఫీసర్ సుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి


బాధితుడు అంకయ్య

నాయుడుపేట టౌన్ : వివాహితను తీసుకెళ్లిన వ్యక్తి అన్నపై ఆమె కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం సాయంత్రం జరగగా ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాయుడుపేట మండలం కాపులూరు గ్రామానికి చెందిన కాకాణి అంకయ్య తమ్ముడు సురేష్ కొద్ది రోజుల క్రితం అదే గ్రామంలోని ఒక వివాహితను తీసుకెళ్లిపోయాడు. అతనిపై ఆ మహిళ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెను తీసుకెళ్లిపోవడంలో అంకయ్య ప్రమేయం ఉందని మహిళ కుటుంబ సభ్యులు భావించారు. బుధవారం సాయంత్రం అంకయ్యను కాపులూరు గ్రామ సమీపంలో ఉన్న స్వర్ణముఖి నది వద్దకు తీసుకెళ్లారు. అక్కడ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ చేస్తున్నారు.

దివ్యాంగులకు ఫల సరుకులు పంపిణీ


దివ్యాంగులకు ఫల సరుకులు అందజేస్తున్న దాతలు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో వున్న కల్యాణ వీరభద్ర స్వామి ఆలయ ఆవరణలో గురువారం ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో రెడ్ సంస్థ 37 మంది దివ్యాంగులకు నెలకు సరిపడా ఫల సరుకులు పంపిణీ చేసింది. సంస్థ ప్రతినిధి జానా సుధీర్ మాట్లాడుతూ గూడూరుకు చెందిన డాక్టర్ రోహిణి సరుకులతో పాటు రూ.5 వేలు అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ తనూజ, ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, శశిరేఖ, సంస్థ ప్రతినిదులు పల్లం వెంకటేశ్వర్లు, మెదురు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట విద్యార్థికి ప్రతిభ అవార్డు


విద్యార్థి షేక్ సమీర్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటకు చెందిన విద్యార్థి షేక్ సమీర్ ప్రతిభ అవార్డు దక్కించుకున్నాడు. అతను విక్రమ్ జూనియర్ కళాశాలలో 2023–25లో ఇంటర్‌లో ఎంఈసీలో మంచి మార్కులు సాధించాడు. అతన్ని ప్రభుత్వం ప్రతిభ అవార్డుకు ఎంపిక చేసింది. సమీర్‌ను కళాశాల డైరెక్టర్లు జలదంకి విజయబాబు రెడ్డి, కామిరెడ్డి సుబ్బారెడ్డి, ముత్యాల సంఘమిత్ర, అధ్యాపకులు అభినందించారు.

ఉపాధి హామీ కింద మొక్కల పెంపకం


మొక్కలు నాటుతున్న ఉపాధి ఏపీవో

చిల్లకూరు : ఉపాధి హామీ కింద మొక్కల పెంపకం చేపడుతున్నట్టు ఏపీవో గిరిబాబు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలవకొండ, తొణుకుమాల పంచాయితీలలోని పారం పాండ్ల వద్ద మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ సహకారంతో ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో 2,788 మొక్కలు నాటుతున్నట్టు తెలిపారు. రోడ్ల పక్కన ఐదు కిలోమీటర్ల మేర 2,200 మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పారం పాండ్ల వద్ద 588 మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను కూలీలకు అప్పగించనున్నట్టు తెలిపారు. ఇందుకు గాను కొంత నగదు అందజేస్తామన్నారు. అనంతరం మొక్కలను సంరక్షిస్తామని కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కలువాయి(సైదాపురం) : కలువాయి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో భవాని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

దొరవారిసత్రం/చిట్టమూరు/చిల్లకూరు/వెంకటగిరి రూరల్ /రాపూరు/ఓజిలి/బాలాయపల్లి(సైదాపురం)/కలువాయి (సైదాపురం) : పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పలుచోట్ల మొక్కలు నాటారు. వాటిని సంరక్షించాలని కోరారు. విచ్చలవిడిగా చెట్లు నరికి వేయడం, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్నారు.

- దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫారెస్ట్ రేంజర్ సౌజన్య, ఎఫ్ఎస్‌వో బాలయ్య, ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన, ఏపీఎం మునిరాజ, ఏపీవో ఉషారాణి, కేజీబీవీలో ఎస్‌వో పార్వతి, సూపర్‌వైజర్ హేమలత మొక్కలు నాటారు.
- చిట్టమూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణం, డంపింగ్ యార్డు, పోలీసు స్టేషన్ ఆవరణలో ఎంపీడీవో మనోహర్ గౌడ్ మొక్కలు నాటారు. ఉపాధి ఏపీవో షీలా, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
- గూడూరు పట్టణంలోని అశోక్ నగర్‌లో వున్న మున్సిపల్ పార్కు, చిల్లకూరులోని లేఅవుట్లలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. గూడూరు రెండో పట్టణంలోని కోర్టు ఆవరణలో ఏడో అదనపు జిల్లా జడ్జి నాగపవన్, సీనియర్ సివిల్ జడ్జి బీవీ సులోచనరాణి మొక్కలు నాటారు. బార్ జనరల్ సెక్రటరీ ఎంవీ క్రిష్ణయ్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కోటేశ్వరరావు, న్యాయవాది అరవ పార్వతయ్య, ఎస్‌కే మహబూబ్ బాషా, అబ్దుల్ కలాం ట్రస్టు అధ్యక్షుడు తాజుద్దీన్ పాల్గొన్నారు.
- వెంకటగిరి పట్టణం నగరవనంలో ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి, బీజేపీ నేత ఎస్ఎస్ఆర్ నాయుడు, వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ప్యానల్ న్యాయవాది, బార్ ఉపాధ్యక్షుడు అద్దంకి గాంధీ మొక్కలు నాటారు.
- రాపూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అటవీశాఖ శాఖ కార్యాలయంలో అధికారులు మొక్కలు నాటారు. అధ్యాపకులు సాయికిరణ్, ఎంపీపీ ప్రసన్న, సర్పంచ్ జయమ్మ, ఎస్ఐ వెంకటరాజేష్ పాల్గొన్నారు.
- ఓజిలి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో విజయలక్ష్మి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎం పద్మమ్మ, ఏపీవో చిన్నయ్య, సీనియర్ అసిస్టెంట్ కడివేటి జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షుడు గుజ్జలపూడి విజయ్‌కుమార్‌నాయుడు, బచ్చల రవీంద్రరెడ్డి, అలిమిలి మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.
- బాలాయపల్లి మండలం వెంగమాంబపురం జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ కరుణకుమారి మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మునీంద్ర పాల్గొన్నారు.
- కలువాయి గ్రామ సచివాలయ ఆవరణలో సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి మొక్కలు నాటారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్‌కే ఖాజా రసూల్ తదితరులు పాల్గొన్నారు.


ఓజిలి: మొక్కలు నాటుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి



బాలాయపల్లిలో మొక్కలు నాటుతున్న అధికారులు


రాపూరులో మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు


కలువాయిలో అధికారుల ప్రతిజ్ఞ


దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల కేంద్రంలో..


గూడూరులో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే


గూడూరు కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జిలు


వెంకటగిరి నగర వనంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ


చిట్టమూరులో..